జైపూర్ సుగర్స్ ఎమ్‌డి రాజేశ్వరి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జైపూర్ షుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్వరి రామకృష్ణన్(98) శుక్రవారం తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో మృతి చెందారు. రాజేశ్వరి మృతి పట్ల శ్రీరాజేశ్వరి రామకష్ణ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ఆళ్ల శివకుమార్, ప్రతినిదులు కె.వెంకట్రావు, ఎ.రామారావు, వివి.ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలిపారు. తొలుత ఆమె చిత్రపటాకి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆమెకు సంతాపంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు సంతాపం తెలిపారు. ఈ ఫ్యాక్టరీపై పలువురు రైతులు, స్థానికులు ఉపాధి పొందారు. కొన్నేళ్లుగా ఈ ఫ్యాక్టరీ మూతబడింది.

వణికిస్తున్న చలి పులి

- కమ్ముతున్న పొగమంచు
- భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- అనారోగ్యాల బారిన జనం

రాజానగరంలో పొగమంచు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. పొగమంచు పూర్తిగా కమ్ముతోంది. దానికి తోడు చల్లని గాలులు వీస్తుండడంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. గతేడాది ఇదే రోజుల్లో రాత్రి వేళల్లో 22 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవగా ఇప్పుడు 20 నుంచి 19 డిగ్రీలకు పడిపోతున్నాయి. గురువారం 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో కూడా ఇదే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. దీంతో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్నాయి.

పొగ మంచుతో ఇబ్బందులు

చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు పొగమంచు కురుస్తుండటంతో తెల్లవారుజాము నుంచి 7 గంటల వరకూ రహదారుల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. నిత్యం పలువురు చిరు వ్యాపారులు సొంత గ్రామాల నుంచి వివిధ వ్యాపారాల కోసం మండల, మున్సిపల్ కేంద్రాలు, నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సైకిళ్ళు, మోటారు వాహనాలపై రావాల్సి వస్తుండడంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. మంచు ధాటికి ద్విచక్ర, పెద్ద వాహనాలు నడపటం డ్రైవర్లకు కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో పొగమంచు వల్ల తరచూ ప్రమాదాలు సంభవిసున్నాయి. ముఖ్యంగా పెద్దాపురం వైపు నుండి రాజానగరం వెళ్లే ఎడిబి రోడ్డు, కాకినాడ రూరల్ అచ్చంపేట నుండి బీచ్ కు వెళ్లే రహదారులపై ఎక్కువగా పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పెరుగుతున్న చలి

వాతావరణంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు 27 నుంచి 28 డిగ్రీలు వరకూ నమోదవుతుండగా రాత్రి వేళల్లో మాత్రం 20 నుంచి 19 డిగ్రీలకు పడిపోతున్నాయి. దీంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత ఉదయం 8 గంటలు దాటినా తగ్గడం లేదు. ఈ చలి తీవ్రత రాబోవు రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందంటున్నారు.

స్వెట్టర్లకు పెరిగిన గిరాకీ

చలి తీవ్రత అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో స్వెట్టర్లకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలో కాకినాడ నగరంతో బాటు మున్సిపల్ కేంద్రాల్లో భారీగా స్వెట్టర్ల అమ్మకందార్లు పెద్ద సంఖ్యలో దుకాణాలను నెలకొల్పి వ్యాపారాలు సాగిస్తున్నారు. చలి తీవ్రతను దష్టిలో ఉంచుకుని పలువురు వాటి కొనుగోలుకు క్యూ కడుతున్నారు.

వెంటాడుతున్న వ్యాధుల భయం

ప్రస్తుతం కరోనా కేసులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ చలిలో వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. చలి వల్ల ఊపిరితిత్తులు కొంత ఆయాసానికి గురవుతాయి. చర్మం పగుళ్ళ బారడం ఆరంభమవుతుంది. మిగతావారితో పోలిస్తే చలికాలం పసికందులు, వద్ధులకే సమస్యలెక్కువ. ఈ కాలం వీళ్లల్లో రెసిస్టెన్స్ లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటికి తెప్పించే శక్తి లేకపోవటం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఎక్కువవుతుంది. వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగుసుకుపోయే ప్రమాదం ఉంది. కదలికలు తగ్గి కొన్నిసార్లు పట్టు తప్పి పడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. పసికందులను చలిగాలి సోకకుండా వెచ్చగా ఉంచాలి. స్వెటర్లు, మెత్తని రగ్గులు వాడాలి. చలికాలంలోనే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి. ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతుంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ప్రత్యేకించి వృద్ధుల్లో సిస్టాలిక్, డయాస్టాలిక్ రక్తపోట్లు రెండూ పెరుగుతాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే వారిలో చల్లగాలి వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి.

రాజమహేంద్రవరం జాంపేట గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఇండియా ఫోరం నాయకులు

మోడీ ప్రభుత్వ నిరంకుశ చర్యలను వ్యతిరేకించండి

ప్రశ్నించిన విపక్ష ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం
ఇండియా ఫోరం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పార్లమెంట్‌లో పొగ బాంబులు వేసిన ఆగంతకులపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్న ఇండియా ఫోరం పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుంచి అన్యాయంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాజమహేంద్రవరం జాంపేటలో ఇండియా ఫోరం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఇండియా ఫోరంలో ఉన్న సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్.న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళి, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఐ ఎం.ఎల్.న్యూడెమోక్రసీ నాయకులు జోజి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఇంత నిరంకుశత్వంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇండియా ఫోరంకి చెందిన 150 మంది ఎంపీలను అక్రమంగా సస్పెండ్ చేసి నల్లచట్టాలను ఆమోదించడం చాలా సిగ్గుచేటన్నారు. పార్లమెంట్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చమంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. పార్లమెంట్‌లోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు బిజెపి ఎంపీ ఇచ్చిన పాస్‌తోనే వచ్చారన్నారు. విచారణ చేస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని డిమాండ్ చేశారు. విచారణ చేయాలని డిమాండ్ చేస్తుంటే 150 మంది ఎంపీలను సస్పెండ్ చేసి నల్ల చట్టాలను ఆమోదింపచేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం చేయడమే అన్నారు. వారందరిపై తక్షణం సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు అందరి సమక్షంలో మళ్లీ చట్టాలపై బిల్లులు ప్రవేశపెట్టి చర్చించాలని, అనంతరమే ఆమోదించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మోదీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వైపిపి, టిడిపి, జనసేన పార్టీల వైఖరిని కూడా ప్రజలందరూ గమనించాలని కోరారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ ఇండియా ఫోరం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే వరకు దేశ వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, ఎస్.రాజా, సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, ఎస్ఎస్.మూర్తి రామచంద్రరావు, నాయకులు కె.రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ముళ్ల మాధవ్, ఆకుల భాగ్యసూర్యలక్ష్మి, పిసిసి సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, బెజవాడ రంగారావు, బిల్డర్ బాబి, బత్తిన చంద్రరావు, నాయకులు చామర్తి లీలావతి, ఇజ్జరౌతు విజయలక్ష్మి, రాజు, సిపిఐ నాయకులు సప్పా రమణ, కుంద్రపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం : ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న ఎన్నికల్లో అరాచక వైసిపిని సానంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. టిడిపి అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక 41వ డివిజన్లో జనసేన పార్టీతో కలిసి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 41వ డివిజన్ టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నగర కమిటీ అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు పర్యవేక్షణలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు వై.శ్రీనుతో కలిసి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా లోకేష్ యువగళం పాదయాత్ర సాగిందన్నారు. 253 రోజుల పాటు సాగిన ఈ యాత్రతో టిడిపి కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొందన్నారు. జగన్ నిరంకుశ పాలన వల్ల పడుతున్న ఇబ్బందులను యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రజల ద్వారా వింటూ ముందుకు సాగారన్నారు. ప్రతి సమస్యనూ గుర్తించి అధికారంలోకొచ్చిన తరువాత ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తామనేది లోకేష్ ప్రజలకు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ నాయకులు, నగర కమిటీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ కమిటీల సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రాస్తారోకో

11వ రోజుకు నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యల పరిష్కారం కోసం, డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా రాస్తారోకోలు నిర్వహించారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగింది. సబ్ కలెక్టర్ నుంచి గణేష్ చౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో 20 నిమిషాలు పాటు రాస్తారోకో నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా మానవహారానికి సహకరించారు. హామీలు అమలు చేయాలని, కనీస వేతనం, గ్రాడ్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన సెలవులు, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా పధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తూతూ మంత్రంగా అంగన్‌వాడీలతో చర్చలు జరిపిందన్నారు. ప్రధానమైన డిమాండ్లు పక్కన పెట్టి డిమాండ్స్ నెరవేర్చామని చెప్పుకోవడం శోచనీయమన్నారు. ప్రధాన డిమాండ్ లైన వేతనాలు పెంపు, గ్రాడ్యుటీ అమలు తేల్చే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ అంగన్‌వాడీలను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి మాట్లాడుతూ కార్మిక, ప్రజా సంఘాలు,ఉద్యోగ సంఘాలు, లబ్ధిదారుల్ని కలుపుకొని ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కెఎస్‌వి.రామచంద్రరావు, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడారు. అంగన్‌వాడీ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రాజెక్ట్, అధ్యక్షులు శారద, కార్యదర్శి సునీత, కోశాధికారి రామలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు. **రాజానగరంలో** నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు మార్తమ్మ, కార్యదర్శి వై.సుజాత, ఏడుకొండలు, ఎన్.సుజాత, శ్రీదేవి, సరస్వతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **గోకవరంలో** సమ్మె కొనసాగుతోంది. దీక్ష శిబిరం నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాస్కరం, మాలతి, విజయ కుమారి, ధర్మకుమారి తదితరులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఎద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాలు నష్టపోయాయన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై దాడి చేసి తాళాలు బద్దలు కొట్టడం చాలా హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. రైటప్:3 అంగన్వాడీ ల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్నా జ్యోతులనెహ్రూ. **కొవ్వూరు** ఆర్‌డిఒ కార్యాలయం నుంచి అల్లూరి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు మాట్లాడారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ కొవ్వూరు ప్రాజెక్టు నాయకులు వసంతాడ శ్రీదేవి, చీర దుర్గాభవాని, బి.పద్మజ తదితరులు పాల్గొన్నారు. **చాగల్లులో** దీక్షలు కొనసాగతున్నాయి. సిఐటియు జిల్లా అధ్యక్షులు సుందర్ బాబు, మండల కార్యదర్శి కెకె.దుర్గారావు హాజరై మాట్లాడారు. సమ్మెలో భాగంగా మానవహారం నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి ఎస్,అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. **ఉండ్రాజవరంలో** చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. సిడిఎస్ ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎపిటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మీకుమారి, ఎస్.రంగనాయకమ్మ, ఎం.జానకి, కెఎన్ఎస్.ప్రసన్నకుమారి, కె.విజయకుమారి, పుల్లరత్నం పాల్గొన్నారు. **తాళ్లపూడి**లో పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు బిక్షాటన చేశారు. జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు. **కడియం** బొబ్బిలి బ్రిడ్జి సెంటర్లో అంగన్వాడీలు రాస్తారోకో చేపట్టి మానవహారం నిర్వహించారు సిఐటియు రాజనగరం ప్రాజెక్టు లీడర్ వై.సుజాత మాట్లాడారు. ఈ ధర్నాలో డి.వెంకటలక్ష్మి, ఏడుకొండలు, సత్యవతి, మేరీ, సిహెచ్.జగదాంబ, నాగమణి, శాంతకుమారి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. **దేవరపల్లిలో** రాంగోపాల్ వర్మ, మంత్రి ఉషశ్రీ వ్యాఖ్యలకు నిరసనగా అంగనవాడీలు రాస్తారోకో చేశారు. వారి చిత్రపటాలను దహనం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, నాయకులు కాట్రు భీమరాజు, గన్నమణి హరికష్ణ మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు టిపి.లక్ష్మి, ఎ.పద్మకామేశ్వరి, టి.ఇందిర తదితరులు పాల్గొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఉండవల్లి కష్ణారావు హాజరై మద్దతు తెలిపారు. **పెరవలి** మండల పరిషత్ కార్యాలయం సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. పెరవలి సెంటర్‌లో ానవహారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి కె.కృష్ణవేణి, సహాయ కార్యదర్శి బి.నాగవేణి సెక్టార్ లీడర్స్ సిహెచ్.విశాలి, వి.నిర్మల కన్యాకుమారి తదతరులు పాల్గొన్నారు. **గోపాలపురంలో** చెక్‌పోస్ట్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు రామలక్ష్మి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలన్నారు.

గోపాలపురంలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

రాజమహేంద్రవరంలో మానవహారం

గోవరంలో మద్దతు తెలుపుతున్న జ్యోతుల నెహ్రూ తదితరులు

కార్టూ'నిజం'



'సిట్టింగ్'లకు టిక్కెట్లు లేవట...
'ఫిట్టింగ్'లు పెట్టేవారికేలా ఉంది గురూ!!!

3వ రోజుకు ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలు పరిష్కరించాలని, హామీలు అమలు చేయాలని ఎస్ఎస్ఎ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరింది. డిఇఒ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎన్నికల ముందు ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులు సిఆర్‌ఎంటిలకు, ఎంఐఎస్, సిఒలకు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, తక్షణమే గ్రాస్ పే, ఎంటిఎస్, డిఎ, హెచ్ఆర్ఎ అమలుచేసి, వేతనం పెంచాలని, పార్ట్ టైం ఉద్యోగుల హోదా పెంచి ఫుల్ టైం ఉద్యోగుల విధానాన్ని అమలు చేయాల్నఅ్నరు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ప్రతి నెల ఒకటో తేదీ వేతనాలు చెల్లించి, సంవత్సరానికి సరిపడే బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీములు అమలు పరచాలని, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను, ఉద్యోగ విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 19 మండలాల నుంచి సుమారు 300 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. సిఐటియు. జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్ మూర్తి, జిల్లా కోశాధికారి కె. ఎస్.ఎస్.వి.రామచంద్రరావు, జిల్లా నాయకులు పవన్, బి. రాజులోవ, ఎస్‌టియు. జిల్లా అధ్యక్షుడు జె.డానియేల్‌బాబు, జిల్లా ఉద్యమ నాయకులు డివి.కష్ణంరాజు, ఎం.రఘునాథ్, హాస్పిటల్స్ యూనియన్ కార్యదర్శి శ్రీను, అంగన్వాడీ కార్యకర్తలు సునీత, డి. రామలక్ష్మి తదితర సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లు నెరవేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమగ్రశిక్ష వివిధ శాఖల ఉద్యోగులు ఎం.రఘునాథ్, ఎం.మిరపరాజు, ఆర్.వెంకట్రావు, కె.చంద్రకుమార్, ఎ.వీరపండు, జి.బాలకృష్ణప్రసాద్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమ్మె శిబిరంలో ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులు, మద్దతు దారులు

రుణాల మంజూరుకు సహకరించాలి

బ్యాంకర్ల సమావేశంలో జెసి తేజ్‌భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బ్యాంకర్లు అల్పాదాయ వర్గాలకు, స్వయం సహాయక సంఘాలకు, కౌలు రైతులకు రుణాలు మంజూరుకు సహకరించాలని జెసి ఎస్.తేజ్‌భరత్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్స్‌తో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ, జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి జెసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో అజెండా అంశాలుగా సెప్టెంబర్ 29న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలు, అనంతర ప్రగతి, 2023-24 వార్షిక ప్రణాళిక అమలు పురోగతి, ప్రాధాన్యత అంశాలు, అల్పాదాయ వర్గాల ఆర్థిక చేకుర్పు, వ్యవసాయ అనుబంధ రంగాల రుణ ప్రణాళిక ప్రగతి, విద్యా సంబంధ రుణాలు, టిడ్కో ఇంటి రుణాలు, హౌసింగ్ రుణాలు, ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజీ, వికసిత్ భారత్, విశ్వ కర్మ యోజన, కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో రైతులకు రుణ ప్రణాళిక లో భాగంగా స్వల్ప కాలిక రుణాలకు సంబంధించి 6216 మందికి 2,893, టర్మ్ రుణాల కోసం 2,775కు 1,651 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. మిగిలిన లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.. జిల్లాలో కౌలు రైతులకు సంబంధించి 95,698 సిసిఆర్‌సి కార్డులు జారీ చేశామని, ఇప్పటి వరకు సుమారు 32 వేల మందికి సుమారు రూ.144 కోట్ల మేర రుణాలు అందించామన్నారు. జిల్లాలో 18,531 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.71,121.50 లక్షలకు గాను 12,084 గ్రూప్‌లకి రూ.84,575.22 లక్షలు (118.92%) మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిసిసి కన్వీనర్ వై.సురేష్, ఆర్‌బిఐ ప్రతినిధి నాగ ప్రవీణ్, ఎల్‌డిఎం ప్రతినిధి డివి.ప్రసాద్, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

టీ తాగి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన దేవర సూర్యనారాయణ ఈనెల 17 న టీ తాగి వస్తానని చెప్పి బయటకు వెళ్లి సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలు బంధువుల ఇంటివద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని భార్య కాంతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

విగ్రహ ధ్వంసం కేసులో జైలు

ప్రజాశక్తి-కాకినాడ

ఆంజనేయ స్వామి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో ముద్దాయికి 18 నెలల జైలుశిక్ష విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెల్లడించారు. 2022 డిసెంబర్‌లో కాకినా అచ్యుతాపురం రైల్వేగేటు దగ్గర శ్రీకష్ణ మందిరానికి చేర్చి ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహానికి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆలయ ఇఒ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి కురాకుల శ్రీనివాసును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.వెంకటేశ్వరరావు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.30 లక్షల జరిమానాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా 450 కేసులకు రూ.30 లక్షల జరిమానా వసూలు చేసి కోరంగి పోలీసులు రికార్డు సృష్టించారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు నెలల్లో 400 పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు రూ.30 లక్షల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. జాతీయ రహదారి 216 పోలీస్ స్టేషన్ పరిధిలో అటు యానాం నుంచి కాకినాడ వరకు వరకు తరచుగా ప్రమాదాల్లో అనేకమంది మృత్యువాత పడటంతో పాటు, ఎంతోమంది తీవ్ర గాయాలు పాలవుతున్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండంతో జిల్లా నలుమూలల నుంచి మందుబాబులు యానాం వచ్చి మద్యం సేవిస్తుంటారు. అతిగా మద్యం సేవించి ఆ మద్యం మత్తులో వాహనాలు నడపడం కారణంగా అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కారణంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్న ఎస్పి ఆదేశాల మేరకు కోరంగి ఎస్ఐ రవికుమార్ నేతృత్వంలో రెండు నెలలుగా విస్తతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 450 పైగా కేసులు నమోదయ్యాయి.

పట్టుబడ్డ సబ్ ఇంజనీర్

ఎసిబికి చిక్కిన విద్యుత్ ఇంజనీర్

ప్రజాశక్తి-మండపేట

మండపేటకు చెందిన రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసేందుకు విద్యుత్ శాఖ సబ్ ఇంజనీరు దుర్గాప్రసాద్ రూ.70 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డార. దీనికి సంబంధించిన విషయాలను ఎసిబి ఎఎస్పి సిహెచ్.సౌజన్య విలేకరులకు వివరించారు. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన రైతు ముళ్లపూడి శ్రీనివాస్, మండపేట పట్టణానికి చెందిన తన మామ రైతు గోపాలకృష్ణ, మరో రైతు రఘుల తరపున వ్యవసాయ విద్యుత్ కనెక్షను కోసం డిశంబరు 2వ తేదీన దరఖాస్తు చేసుకున్నారు. రెండు విద్యుత్ మోటర్లు ప్రాసెస్ చేసి మోటార్లు బిగించేందుకు రూ.61,292 ఖర్చవుతుందన్నారు. ఎస్టిమేషన్ ఇచ్చేందుకే రూ.70వేలు లంచం అడగడంతో రాజమహేంద్రవరంలోని తమ ఎసిబి కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఫిర్యాదు దారు శ్రీనివాస్ రూ.70వేలు లంచం ఇవ్వగా వెంటనే దాడి నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సబ్ ఇంజనీరు దుర్గాప్రసాద్ ఏడాదిన్నర క్రితం పిఠాపురం మున్సిపాలిటిలో లైన్‌మెన్‌గా పనిచేసి పదోన్నతిపై వచ్చినట్లు తెలిపారు. ఈదాడిలో ఎసిబి ఎఎస్పి సౌజన్య, సిఐలు డి.వాసుకృష్ణ, ఎడి.శ్రీనివాసరావు, వైసతీష్, ఎస్ఐ విల్సన్ పాల్గొన్నారు.

రమాదేవి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరపల్లి

ఇటీవల దేవరపల్లి మండలం కష్ణం పాలెం గ్రామంలో అకాలంగా మరణించిన ఆశా వర్కర్ సీలబోయిన రమాదేవి కుటుంబానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు రూ.25 వేల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆండ్రు అనిల్, నాయకులు గన్నమణి హరికష్ణ ,కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రమాదానికి గురైన వ్యక్తికి 'రక్షణ' చేయూత

గోపాలపురం : మండలంలో హుకుంపేటకు చెందిన సిహెచ్.సుబ్బారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణ భారమైంది. విషయం తెలుసుకున్న మండల రక్షణ సేవా సమితి స్పందించి శుక్రవారం క్షతగాత్రుడిని పరామర్శించి రూ.5వేల నగదు, నిత్యావసర సరుకులు అందించారు. త్వరగా బాగుపడి తిరిగి కోలుకోవాలని రక్షణ సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఆకాంక్షించారు. రక్షణ సేవా సమితి అధ్యక్షులు గల్లా ఎలీషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బి.షాలేం, ముఖ్య సలహాదారుడు దాసరి రామారావు, సభ్యులు రాజారత్నం, కె.మనోహర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసనలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎపి.భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో న్యాయవాదులు చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం భూ హక్కుల చట్టం ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడారు. ఈ చట్టం వల్ల సామాన్య రైతుల భూములను భూ ఆక్రమణ దారులు ఆక్రమించుకునే వీలుంటుందన్నారు. ఈ చట్టం భూములను అక్రమ రికార్డులను చేయించుకునే భూ కబ్జాదారులకు చుట్టంగా మారుతుందన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన అవకతవకలను ప్రజలు ప్రశ్నించే అధికారం, న్యాయస్థానాలను వెళ్లే అవకాశాలను చట్టం హరిస్తుందన్నారు. భూ వివాదాలను సత్వరం పరిష్కరించాలంటే వాటి కోసం ప్రత్యేకమైన న్యాయస్థానాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి చట్టం ద్వారా సత్వర న్యాయం అందిస్తామనడం అవివేకమన్నారు. రాజకీయ జోక్యం లేకుండా స్వతంత్రంగా కొనసాగే న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలు తొలగించి, రెవెన్యూ అధికారులకు దారాదత్తం చేయడం వలన ప్రజలు చట్టబద్ధ హక్కులను కోల్పోతారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు భూ విషయాల్లో చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యల వల్ల న్యాయస్థానాల్లో భూ వివాదాల కేసులు విపరీతంగా ఉన్నాయన్నారు. అటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే అధికారులకు ఆస్తులపై హక్కుల నిర్ధారించే హక్కు, వారసులను నిర్ధారించే హక్కు ఇవ్వడం తగదన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే నిరంకుశత్వం, అరాచకం, అవినీతి, రాజకీయ జోక్యం విజృంభించి ప్రజల భూహక్కులకు భద్రత లేకుండా పోతుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి బార్ అసోసియేషన్ కోశాధికారి ఎం.వి.దుర్గా ప్రసాద్, రామారావు చౌదరి, సూరపురెడ్డి తాతారావు, జి.దేవిభవాని, దాసరి అమ్ములు, సీనియర్ న్యాయవాదులు కె.సునీల్, బిజెఎస్.దివాకర్, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, రాజ్ కుమార్, కాశి శ్రీనివాసరావు, తమ్మారెడ్డి ప్రాణిగ్రాహి, నరసింగ శ్రీనివాసు, బట్టు సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు ప్రారంభించారు.

రాజానగరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్‌ను నిర్వహించారు. విసి కె.పద్మరాజు ప్రారంభించారు. నేటి యువత శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అన్ని శాస్త్రాలు గణితశాస్త్రంతో ముడిపడి ఉన్నాయని, గణితశాస్త్రం ప్రాధాన్యతను యువతకు తెలియజేసి, గణితశాస్త్ర విభాగాన్ని మరింత పటిష్టపరచాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ దేశంలోని గణితశాస్త్ర అభిలాషకులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్న ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ టి.హైమావతిని విసి అభినందించారు. జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 876 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, టి.శ్రీనివాసరావు, డాక్టర్ వి.మల్లిప్రియ, కెవిఎం.వరకుమార్, జి.అశోక్, కె.గీతాలక్ష్మి, డాక్టర్ ఎల్.సుజాత పాల్గొన్నారు.

దేవరపల్లిలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జంగారెడ్డిగూడెం భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ జనపనేని సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని గణితం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి భాష్యం ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు, చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా,ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కాల్దారి నెంబర్-3 పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ సక్సేనరాజు పాల్గొని మాట్లాడారు. రామానుజన్ కేవలం 30 ఏళ్ల వయస్సులోనే గణితంలో అనేక చిక్కు సమస్యలను పరిష్కరించి, ఎన్నో కొత్త సిద్ధాంతాలను ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని పులి కుసుమ తయారు చేసిన బోధనోపకరణ సామగ్రిని ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ, బోధనోపకరణ సామగ్రి బోధనను ఆకర్షణీయంగా చేసే సాధనమన్నారు. ఉపాధ్యాయిని కుసుమను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభద్రకుమారి, కట్టా హేమలత, శివప్రసాద్ అభినందించారు. **తాళ్లపూడిలో** రామానుజన్ జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

తాళ్లపూడిలో రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

క్రిస్మస్ అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలి

రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పవిత్ర క్రిస్మస్ పండుగ జిల్లా ప్రజలందరి జీవితాలలో సుఖసంతోషాలను నింపాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాక్షించారు. శుక్రవారం మంజీరా హోటల్ ఆడిటోరియంలో క్రిస్మస్ ఈవ్‌ను పురస్కరించి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హై-టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ రామ్, జెసి ఎన్.తేజ్ భరత్, రూడా చైర్మన్ రౌతు సూర్యప్రకాష్ రావు, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఫైనాన్సియల్ సభ్యులు కుండా జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రైస్తవ ప్రజలందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుత సహజీవనమే క్రిస్మస్ పండుగ అందించే సందేశమని తెలిపారు. రాష్ట్రంలో అందరికీ మంచి చేయాలన్న ఆలోచనతో, సంకల్పంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. క్రైస్తవుల శ్మశానాల కోసం జిల్లాలో 72 ఎకరాలు సేకరించామన్నారు. జెసి తేజ్‌భరత్ మాట్లాడుతూ జీసెస్ బోధనలు అనుసరణీయమన్నారు. ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలో పటిష్టంగా అమలు పరుస్తున్నామని తెలపారు. రూడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశ రావు మాట్లాడుతూ ప్రపంచ మంతా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సిఎం చేయాలన్నారు. ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ సిఎం జగన్ పథకాలను చూసి యావత్ దేశం ఆ దిశగా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తుంద న్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఫైనాన్సియల్ సభ్యులు కుండా జాన్ వెస్లీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి క్రైస్తవులను గుర్తిస్తూ ఆదరిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి అర్బన్ కో-ఆర్డినేటర్ గూడూరు శ్రీనివాస్, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగ ను పుస్కరించికొని అతిధులు కొవ్వత్తులు వెలిగించి, కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.జ్యోతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి బి.నారాయణ పాల్గొన్నారు

కేకు కట్ చేస్తున్న ఎంపీ భరత్, జెసి, ఎంఎల్ఎ తదితరులు

డిజిటల్ విధానంతో మెరుగైన బోధన

ప్రజాశక్తి - పెరవలి

డిజిటల్ విద్య ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఖండవల్లిలో రూ.48.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ నిరుపేద విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ట్యాబ్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రస్తుతం నియజవర్గంలో మొత్తం 1,824 ట్యాబ్‌లు మంజూరయ్యాయన్నారు. నాలుగు న్నరేళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు, పాఠశాల లో మౌలిక వసతులు మెరుగు పరచడానికి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, గోరుముద్ద, నాడు- నేడు, వైఎస్ఆర్ సంపూర్ణపోషణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. విద్యారంగానికి సుమారు రూ.272.76 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిదిండి నాగరాజు, బి.వెంకటేశ్వర్లు, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, స్టేట్ డైరెక్టర్ వీరమల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ ఎస్.రమేష్, సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జగదీష్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్‌లోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ, మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జగదీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు, సిబ్బందికి క్రీస్తు సందేశాన్ని వివరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం పిల్లల సమక్షంలో ముఖ్య అతిథి జగదీష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో సుశీల, మహేశ్వరి, ఉదయకుమారి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

25న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 25న రెండో విడతగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. కేంద్ర సంక్షేమ పథకాలను ప్రచారం చేసేందుకు దేశవ్యాప్తంగా ఈ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. రెండోసారి యానాంలో ప్రచారం చేసేందుకు ఆయా శాఖల అధికారులతో శుక్రవారం ఆర్ఎఒ సమావేశం ఏర్పాటు చేశారు. యాత్రకు సంబంధించి అధికారులు చేపట్టవలసిన ఏర్పాట్లపై వివరించారు.

గణిత నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రీజెన్సీ పాఠశాలలో గణిత దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా స్థానిక మెట్టకూరు రీజెన్సీ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్వి.ప్రసాదరావు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు గణిత నమూనాలను ప్రదర్శించి గణిత శాస్త్ర ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం గణిత క్విజ్ పోటీల నిర్వహించి ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి చెక్కల వీరభద్రం, ఉపాధ్యాయులు వి.నాగేంద్ర కుమార్, బి.నాగి నూకిరెడ్డి, భాస్కరమణి, జి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గైట్‌లో పరిశోధనలపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం సమీపంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బహుళ విభాగాల పరిశోధన, ఆవిష్కరణలు అనే అంశంపై శుక్రవారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు హాజరై మాట్లాడారు. నైపుణ్యాలతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. మరో ముఖ్య అతిథి రిజిస్ట్రేషన్ ఆచార్య జి.అశోక్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మరో ముఖ్య అతిథి అవిజోల్ టెక్నాలజీ సిఇఒ పవన్ చెలమలశెట్టి మాట్లాడుతూ ప్రతి ఏడాదీ గ్రాడ్యుయేట్ సాధించిన విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా ఉంటున్నాయన్నారు. ఈ సదస్సులో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కూరమదాసు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో శుక్రవారంచేశారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఆయిల్ రాజబాబు, రాలి సత్యనారాయణ, కలవపల్లి నాగన్న తాత, రాయి వీరభద్రరావు, కోరముదాసు మణికంఠ, ఆతుకూరి సూర్యనారాయణ, ఆతుకూరి రమేష్, తదితర 10 కుటుంబాలకు చెందిన వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కండువాలు కప్పి వారిని పార్టీలోకి నెహ్రూ ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలందరూ విసుపోయారన్నారు. అందుకే టిడిపి వైపు చూస్తున్నారన్నారు. సీనియర్ నాయకులు కొరముదాసు మల్లికార్జునరావు లాంటి నాయకులు టిడిపిలో చేరడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, మంగరౌతు రామకృష్ణ, అడపా భరత్, మారిశెట్టి భద్రం, ఈది అశోక్, గుండా శివప్రసాద్, అడపా వెంకట్రావు, గున్నారి లాజర్, బంటు చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు

ప్రజాశక్తి - రాజానగరం

ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు, సాంకేతిక విద్యను కల్పించడం లక్ష్యం అని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాజా మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా సుమారు రూ. 15 వేల కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండల మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో దేవరపల్లి జై కిసాన్ వృద్ధాశ్రమంలో టొబాకో బోర్డ్ రిటైర్డ్ సూపర్‌వైజర్ వై.రామకృష్ణ, సూర్య ప్రకాష్ లక్ష్మి దంపతుల జయంతి సందర్భంగా 18 మంది వృద్ధులకు దుప్పట్లు, స్వీట్లు అందించారు. విందు ఏర్పాటు చేశారు. ఆశ్రమం షెడ్ నిర్మాణానికి 10 సిమెంట్ బస్తాలు ఆశ్రమం నిర్వాహకులు డి. భీమరాజుకు అందించినారు. ఈ సందర్భంగా దేవరపల్లి మండల మానవత చైర్మన్ బలుసు సత్యనారాయణ మాట్లాడారు.

రూ.2 కోట్లతో బ్యారేజ్ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సర్ ఆర్డర్ కాటన్ బ్యారేజ్ రోడ్డుకు రూ.2 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నామని హెడ్‌వర్క్స్ ఇఇ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. మరమ్మతుల కారణంగా నెల రోజుల పాటు కాటన్ బ్యారేజ్‌పై రాకపోకలను నిలిపేస్తున్నామన్నారు. ఆయన వెంట డిఇ రమేష్‌బాబు, ఎఇఇ సిహెచ్.సుధాకర్, సాయిరాం తదితరులున్నారు.

ముస్లిములపై నోరు జారితే ఊరుకోబోము

రాజమహేంద్రవరం : మైనారిటీల మనోభావాలు దెబ్బతినేలా టిడిపి నాయకులు తప్పుడు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ హెచ్చరించారు. జాంపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తిరుపతి మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడు ఇమామ్ సాహెబ్‌పై టిడిపి అఫీషియల్ వెబ్‌సైట్‌లో ఆయనను తాలిబాన్లతో పోలుస్తూ ముస్లిముల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రతిసారీ ముస్లిములపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం, అనైతికంగా అణిచివేసే చర్యలు తీసుకోవడం టిడిపికి పరిపాటిగా మారిందన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు హామీలు అమలు కోసం శాంతియుతంగా ప్లకార్డులు ప్రదర్శించిన మైనార్టీ యువకులపై దేశద్రోహం కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. నేడు ఇమామ్ సాహెబ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దీనిపై త్వరలోనే మైనారిటీ కమిషన్‌ను ఆశ్రయిస్తామన్నారు. చేసిన తప్పునకు క్షమాపణలు చెప్పిన, వెబ్‌సైట్ నుంచి పోస్టును తొలగించాలని, లేకుంటే టిడిపి నాయకులు బుద్ధి చెప్తామన్నారు.

క్షయ బాధితులకు పోషకాహారం పంపిణీ

చాగల్లు : బ్రాహ్మణగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ బాధితులకు పోషకాహారం పంపిణీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందంలో భాగంగా పవర్ గ్రిడ్ సహకారంతో బ్రాహ్మణగూడెం పిహెచ్‌సి పరిధిలో క్షయ బాధితులకు వైద్యాధికారి డాక్టర్ కె.నిశిత ఆధ్వర్యంలో పోషకాహార కిట్లు పంపిణీ చేశారన్నారు. ఆమె మాట్లాడుతూ మందులు సక్రమంగా వాడుతూ పోషకాహారం తీసుకుంటే క్షయ నుంచి బయటపడొచ్చన్నారు. అనుమానితులు వైద్యపరీక్షలు చేయించుకుంటే వ్యాధిని ముందుగానే గుర్తించి నివారించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.రామచంద్రరావు, టిబి సూపర్‌వైజర్ పోతురాజు, వి.పద్మ, ఎస్.సారమ్మ, ఎం.రాజశేఖర్, ఎఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చైల్డ్ సైకాలజీ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

రాజానగరం : ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడాలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ పీజీ డిప్లమో కోర్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలని విసి కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఈ కోర్సు వివరాలను వెల్లడించారు. ఏడాది కాలపరిమితితో 40 సీట్లతో ఈ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిర్వహణలో ఈ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ డిప్లొమా కోర్సును అందిస్తున్నామన్నారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పీజీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు జనవరి 8లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ 0883-256611, 7093008477 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం కొవ్వూరు పురపాలక సంఘం కమిషనర్‌కు సమ్మె నోటీసును అందించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నోటీసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో అనేక సభల్లో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ అధికారంలో రాగానే ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, సిపిఎస్‌ను వారం రోజుల్లో రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఆయన అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా నేటికీ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించారన్నారు. అలాంటి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం సమాన పనికి సమాన వేతనం కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. దీంతో ఈ నెల 26 నుంచి అన్ని విభాగాల కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారన్నారు. వీరి సమ్మెకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పూజారి వాసు, వి.శ్యామ్, ఎం.జ్యోతి, సిహెచ్.రాజేంద్ర, సిహెచ్.రాజశేఖర్, ఎం.వరలక్ష్మి, ఎం.ప్రసాద్, పి.లక్ష్మి, కళ్యాణి, వెంకటలక్ష్మి తదిరులు

PUBLIC NOTICE

Known to all that applicant Dangudubiyyam Dharmaraju, S/o.Narasimha Murthy and Co-Applicants Dangudubiyyam Sridevi and Dangudubiyyam Neeharika have been sanctioned a Construction of Commercial Loan by Repco Home Finance ltd., Kakinada Branch. Property Located at All that the Piece and Parcel of immovable property admeasuring an extent of 514.91 sq yards site therein Under Construction RCC Stilt, Ground and First Floor building situated in S.No.119-11 of Sunkarapalem Village, Sunkarapalem Village Gram Panchayat, Tallarevu Mandal, and Tallarevu Sub Registrar, Kakinada District, State of Andhra Pradesh measured as under: **East :** 37'.2'' NH 216 Road, **West:** 43'.3'' Site belongs to Dangudubiyyam Niharika, **North :** 113'.7'' Joint Way, **South:** 116'.0'' Land belongs to Sunkara Kasi Eswaraprasad. Within the above boundaries extent of 514.91 square yards site therein Under Construction RCC Stilt, Ground and First Floor building with all kinds of easementary rights. is in favor of Dangudubiyyam Dharmaraju and Dangudubiyyam Sridevi proposed to mortgage the same in favour of Repco Home Finance ltd., Kakinada Branch to avail Construction of Commercial Loan of **Rs.40,21,240/-** anybody having intrest or claims over the property shall intimate to us with in 7 days from the date of this publication inwriting.

Sunkavilli Dorababu
Panel Advocate in Repco Home Finance ltd.,
Office : D.No:2-17D-6, Venkat Nagar, Kakinada.
Cell:9848369224

మహారాజశ్రీ కాకినాడ 1వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. No. 16/2019

Between :
1) పినపోతు గంగరాజు
2) పినపోతు శివశంకర్ ...పిటీషనర్లు
మరియు
చెక్కా భూలోకమ్మ మరియు 15 ఇతర్లు
..రెస్పాండెంట్లు

R13 : పెమ్మాడి సత్యవతి, W/o. నాగరాజు, డో.నెం. 44-17-47, నాగరాజు వీధి, పప్పుల మిల్లు దగ్గర, జగన్నాథపురం, కాకినాడ. ...13వ రెస్పాండెంట్

పై నెంబరు దావాలో పిటీషనర్స్ వారిని Insolventగా డిక్లేర్ చెయ్యమని దాఖలు చేసిన దావాలో మీకు ఎన్నిసార్లు కోర్టువారు నోటీసులు పంపించినప్పటికీ మీరు తీసుకునియుండలేదు. కావున మీ హాజరు నిమిత్తం **ది. 11-01-2024వ తేదీకి** వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరయ్యి మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. లేని యెడల ఏమీ లేవని భావించి మీ పరోక్షమున తీర్మానించెదరు.

అద్దేపల్లి మురళీధర్
పిటీషనర్ తరపు అడ్వకేట్
ప్రతాప్ నగర్, కాకినాడ
కాకినాడ.
ది.22-12-2023
సెల్: **9849170270**